# ఏఐ యుగంలో సైబర్ భద్రత.. అధ్యాపకులకు జేఎన్టీయూహెచ్ ప్రత్యేక శిక్షణ

- నేటి నుంచి 5 రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్
- మైక్రోసాఫ్ట్ సహకారంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా 90 మంది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ అధ్యాపకుల నమోదు
- జేఎన్టీయూహెచ్ విద్యా వారోత్సవాలు, 'ప్రజాపాలన'లో భాగంగా శ్రీకారం

**భూమి శ్రీనివాస్ రెడ్డి, నవభూమి ప్రతినిధి, మే 5:** ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ వేదికగా అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. రాబోయే జేఎన్టీయూహెచ్ విద్యా వారోత్సవాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకానమీలో సైబర్ సెక్యూరిటీ అనే అత్యంత కీలకమైన అంశంపై 5 రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల ప్రయోజనార్థం జేఎన్టీయూహెచ్‌లోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ' విభాగం.. ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

**ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో తరగతులు..**

ఈ శిక్షణా కార్యక్రమం మంగళవారం నుంచి మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో కొనసాగనుంది. అనంతరం చివరి రోజు సెషన్ ముగింపు కార్యక్రమాన్ని మే 12న ఆఫ్‌లైన్ విధానంలో (ప్రత్యక్షంగా) నిర్వహించనున్నారు. ఈ ఎఫ్‌డీపీ కి విశేష స్పందన లభించింది. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన మొత్తం 90 మంది అధ్యాపకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి జేఎన్టీయూహెచ్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. శ్రీదేవి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

**కీలక అంశాలపై నిపుణుల శిక్షణ..**

ఐదు రోజుల పాటు సాగే ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సైబర్ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై నిపుణులు అధ్యాపకులకు సమగ్ర అవగాహన కల్పిస్తారు. సైబర్ సెక్యూరిటీ ప్రాథమిక అంశాలు, నెట్‌వర్క్ దాడుల పై విశ్లేషణ. వెబ్ సెక్యూరిటీ, సైబర్ చట్టాలు మరియు డిజిటల్ భద్రతా నియమాలు. ప్రస్తుత ట్రెండ్ అయిన సైబర్ సెక్యూరిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర తదితర అంశాలపై లోతైన శిక్షణ ఇవ్వనున్నారు. కేవలం థియరీ మాత్రమే కాకుండా, సైబర్ సెక్యూరిటీ టూల్స్‌పై ప్రయోగాత్మక (హ్యాండ్స్ ఆన్) సెషన్‌లను కూడా నిర్వహించనున్నారు. ఈ ఐదు రోజుల కార్యక్రమం ముగిసిన అనంతరం, శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు అవగాహన స్థాయిని పరీక్షించేందుకు ప్రత్యేక మూల్యాంకనం (అసెస్‌మెంట్) నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే యూనివర్సిటీ అధికారికంగా ధృవీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు) ప్రదానం చేయనుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు.




# సైబర్ సెక్యూరిటీలో ఫ్యాకల్టీకి శిక్షణ ప్రారంభం

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) ఆన్‌లైన్ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. సైబర్ నేరాల నియంత్రణ, ప్రాథమిక సూత్రాలు, వెబ్ సెక్యూరిటీ, సైబర్ చట్టాలు, నెట్‌వర్క్‌పై సైబర్ నేరస్థుల దాడులు తదితర అంశాలపై ఇంజినీరింగ్, పాలిటెక్నికల్ కళాశాలలకు చెందిన 90మంది అధ్యాపకులకు వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. సెంటర్ సమన్వయకర్త డాక్టర్‌ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

# కోర్ ఇంజినీరింగ్‌తోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్ రిఫ్రిజిరేటింగ్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీర్స్ (ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ) డెక్కన్ చాప్టర్ విద్యార్థి విభాగం ఆవిర్భావ కార్యక్రమం మంగళవారం జేఎన్‌టీయూలో జరిగింది. మెకానికల్ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కోర్ ఇంజినీరింగ్‌లోనూ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ విభాగం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ జాయింట్ ఛైర్మన్ మహమ్మద్ ఆసిఫ్ బాషా మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశ్రమల స్థాపన దిశగా అడుగులు వేయాలన్నారు.



కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తదితరులు